క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. డ్రై డే పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. ఇళ్ల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ పూల కుండీలలోని నీటిని రెండు రోజులకొకసారి మార్చాలన్నారు. ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. మురుగు కాలువలను శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంధ్యారాణి, సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా మెప్మా సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించారు.

ప్రజలు ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోండి

- మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్



పరికరాలను పరిశీలిస్తున్న కమిషనర్ జగ్జీవన్

నారాయణఖేడ్: మున్సిపాలిటీ వాసులు స్థానిక ఆక్సిజన్ పార్కులోని ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ కోరారు. శుక్రవారం ఆయన ఖేడ్ పురపాలక పరిధిలోని పలువార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, జ్వర సర్వేను పర్యవేక్షించారు. మెరుగైన సేవలకుగాను సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఓపెన్ జిమ్‌లోని పరికరాలను పరిశీలించారు. ఆయన వెంట శానిటరీ అధికారి శ్రీనివాస్ ఉన్నారు. 1వ వార్డులో నిర్వహించిన ఫ్రైడే డ్రైడేలో భాగంగా వార్డు కౌన్సిలర్ నర్సింహులు ఆధ్వర్యంలో వైద్య, మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలు ఉండకుండా చూడాలని సూచించారు.

అశోక్‌నగర్‌లో బస్తీ దర్శన్



ఓపెన్ డ్రైన్‌ను శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో శుక్రవారం బస్తీ దర్శన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప పాల్గొన్నారు. కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అశోక్‌నగర్, జ్యోతినగర్ కాలనీల మధ్యలో ఉన్న ఓపెన్ డ్రైన్ పాతదికావడంతో వర్షం పడితే రోడ్లపైకి పెద్దఎత్తున నీరు చేరుతుందన్నారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం నిధులను మంజూరు చేయించి.. త్వరలో పనులను ప్రారంభిస్తామని తెలిపారు.

దరఖాస్తులు చేసుకోండి

- డీఏవో శివప్రసాద్



దరఖాస్తులు తీసుకుంటున్న శివప్రసాద్

కల్హేర్(నారాయణఖేడ్): రుణమాఫీపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం నిజాంపేట మండలం బాచేపల్లిలో రైతుల నుంచి రుణమాఫీ దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్ ప్రసాద్, ఏఓ అసియాబేగం, ఏఈఓ శ్రీకార్ పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నారాయణఖేడ్: ఆసక్తి ఉన్న విద్యార్థులు ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ దేవిసింగ్ కోరారు. శుక్రవారం నిజాంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రవేశ పరీక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదోతరగతి, ఇంటర్మీడియెట్ రెగ్యులర్‌గా చదువుకోలేని వారు సెప్టెంబర్ 10లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మరిన్ని వివరాల కోసం 93916 44170 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ రాథోడ్, విజయ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, నారాయణ, లక్ష్మణ్, విఠల్, మారుతి, సత్యనారాయణ, స్వతంత్రం, సురేఖ, సుశీల, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దోస్త్.. అడ్మిషన్లు అంతంతే

- డిగ్రీ వైపు చూడని విద్యార్థులు
- సాంకేతిక కోర్సుల వైపు విద్యార్థుల చూపు
- నాలుగు విడతల్లో సగం సీట్లు కూడా భర్తీ కాని వైనం



సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : సాధారణ డిగ్రీతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తక్కువ. దీంతో విద్యార్థులు సాంకేతిక కోర్సుల వైపు అడుగేస్తున్నారు. ఇంటర్మీడియట్ పూర్తి కాగానే ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ తదితర ప్రొఫెషనల్ కోర్సులపై ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సరైన వసతులు లేని కారణంగా డిగ్రీలో చేరేందుకు ఆసక్తి చూపించడం లేదు. డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించిన దోస్త్ ప్రక్రియ ఈ విద్యా సంవత్సరం మే నెలలో ప్రారంభించింది. ఇప్పటివరకు మొదటి, రెండవ, తృతీయ విడతల్లో జిల్లాలో గల 7 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేటికీ సగం సీట్లు ఖాళీగా ఉండడం గమనార్హం. విద్యార్థులు డిగ్రీ విద్యను అభ్యసించడానికి అంతంత మాత్రమే ఆసక్తిని కనబరుస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 7 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 7 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలున్నాయి. వీటిలో సంగారెడ్డిలో తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జోగిపేట, జహీరాబాద్, సదాశివపేట, పటాన్‌చెరు, నారాయణఖేడ్‌లో డిగ్రీ కళాశాలలున్నాయి. జిల్లా వ్యాప్తంగా డిగ్రీలో 4,320 సీట్లు కాగా గత సంవత్సరం 2,564 మంది, ఈ విద్యాసంవత్సరం 2,531 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. వీటిలో సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1,740 సీట్లకు గానూ రెండు కోర్సులు అదనంగా పెంచారు. దీంతో ఈ విద్యాసంవత్సరం 1,540 అడ్మిషన్‌లు పొందారు. గత సంవత్సరం 1,220 మందే అడ్మిషన్ పొందారు. సంగారెడ్డిలోని మహిళా కళాశాలలో 360 సీట్లకు గానూ గత సంవత్సరం 174 మంది, ప్రస్తుత సంవత్సరం 191 మంది, జోగిపేట డిగ్రీ కళాశాలలో 300 సీట్లకు గానూ గత సంవత్సరం 129, ప్రస్తుత సంవత్సరం 96, జహీరాబాద్ డిగ్రీ కళాశాలలో 540 సీట్లకు గానూ గత సంవత్సరం 310 కాగా, ఈ సంవత్సరం 268, సదాశివపేట డిగ్రీ కళాశాలలో 300 సీట్లకు గానూ గత సంవత్సరం 123 ఈ సంవత్సరం 86, పటాన్‌చెరు డిగ్రీ కళాశాలలో 780 సీట్లకు గానూ గత సంవత్సరం 529 కాగా ఈ సంవత్సరం 574, నారాయణఖేడ్ డిగ్రీ కళాశాలలో 300 సీట్లకు గానూ గత సంవత్సరం 120 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందగా, ప్రస్తుత సంవత్సరం కేవలం 96 మంది విద్యార్థులు మాత్రమే అడ్మిషన్ పొందారు.

కనీస వసతులు కరువు

చాలా చోట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్తి స్థాయిలో అధ్యాపక బృందం లేకపోవడంతో పాటు కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివేందుకు ఇష్టపడటం లేదు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలు జీవితంలో తొందరగా స్థిరపడాలంటే సాంకేతిక కోర్సే మంచిదనే అభిప్రాయంలో ఉన్నారు. అటు వైపు మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రోజురోజుకూ ఆదరణ తగ్గిపోతోంది. మూడు విడతల్లో సీట్లు పూర్తి చేసినప్పటికీ సగం సీట్లు కూడా భర్తీ కాకపోవడంతో జూలై 25 నుంచి ఆగస్టు 12 వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టి అడ్మిషన్‌లకు తీసుకున్నారు. ఆ సమయం ముగిసిపోయిన నేటికీ కూడా ఇంకా సగం సీట్లు భర్తీ కాలేదు.

> **విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**
>
> డిగ్రీలో చేరేందుకు దోస్త్ నోటిఫికేషన్ విడుదల చేసి నాలుగు విడతల్లో సీట్లు అడ్మిషన్‌లు తీసుకున్నప్పటికీ నేటికీ సగం సీట్లు కూడా భర్తీ కాలేదు. మరో స్పెషల్ డ్రైవ్ పెట్టి అడ్మిషన్‌లు తీసుకునే అవకాశం ఉంది. విద్యార్థులు సాంకేతిక కోర్సుల వైపు చూస్తుండడంతో కొంత మేర డిగ్రీ కళాశాలలో డిమాండ్ తగ్గింది.
>
> 
>
> : కేఎస్ రత్నప్రసాద్, తారా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి తదితరులు

నారాయణఖేడ్: డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అందుకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చాలామంది డ్రగ్స్‌కు బానిసలై తమ జీవితాలను ఆగమాగం చేసుకుంటున్నారన్నారు. వీటికి అలవాటు పడి బానిసలుగా మారవద్దన్నారు. డీఎస్పీ వెంకట్ రెడ్డి, క్లబ్ బాధ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



గేమ్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డి సూచించారు. మండలంలోని మార్డిలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ గేమ్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభ గుర్తించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. అంతకు ముందు ఆయనకు విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. ఎంఈఓ శంకర్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, సీడీసీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు స్వయం శక్తితో ఎదగాలి

నారాయణఖేడ్: మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి సూచించారు. పట్టణంలోని ఆక్సిజన్ పార్కులో మహిళా సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన బృందావన్ క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా సీఎం ప్రోత్సహిస్తున్నారన్నారు. మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలని కోరారు. కమిషనరు జగ్జీవన్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, మాజీద్, హన్మాండ్లు, రామకృష్ణ, నర్సింహులు, శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



సంతకాల సేకరణ చేస్తున్న సీఐటీయూ నాయకులు

పటాన్‌చెరు టౌన్: గుంతలు పడిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఇంద్రేశం దర్గా వద్ద సంతకాల సేకరణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం నుంచి దౌల్తాబాద్ వరకు రోడ్డు విస్తరణ చేయాలన్నారు. ఇంద్రేశం రోడ్డు మొత్తం గుంతలమయంగా మారిపోయిందని, రోడ్డు సరిగా లేక అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. ముత్తంగి రింగు రోడ్డు నుంచి శివనగర్ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ కోసం రూ. 20 కోట్లు హెచ్ఎండీఏ ప్రతిపాదనలు పంపి, మంజూరు చేసినా విస్తరణ పనులు చేపట్టడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సురేష్, వరప్రసాద్, శ్రీనివాస్, రాములు, రామకృష్ణ, సాగర్, నరేంద్ర, వీరయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం



వాల్వు వద్ద ఏర్పాటు చేస్తున్న సిమెంటు రింగులు

నారాయణఖేడ్: తరచూ సమస్యలు తలెత్తుతున్న సంపునకు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అధికారులు మరమ్మతులు నిర్వహించారు. విద్యుత్ సమస్యల వల్ల తాగునీటి సరఫరాలో అవాంతరాలు ఏర్పడుతున్నాయి. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. దీంతో శుక్రవారం సిబ్బందితో వెళ్లి అవసరమైన పరికరాలను బిగించి మరమ్మతులు చేశారు. పురపాలిక పరిధిలోని తాగునీటి సరఫరాకు సంబంధించిన వాల్వుల వద్ద వర్షపునీరు, మురుగునీరు చేరి నీరు కలుషితం అవుతోంది. నీరు కలుషితం కాకుండా ఉండేందుకుగాను మున్సిపాలిటీ పరిధిలోని అన్నివార్డుల్లోనూ వాల్వుల వద్ద సిమెంటు రింగులను ఏర్పాటుచేశారు. పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ పర్యవేక్షించారు.

వసతిగృహ పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని బీసీ వసతిగృహం మరమ్మతు పనులకు మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్ స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హాస్టల్ భవనం, మరుగుదొడ్లకు మరమ్మతులు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు తదితర పనుల కోసం ప్రభుత్వం రూ.29.7 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఎం షరీఫ్,* ఆర్ ఏఈ దేవయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బి.నర్సింహులు, మాజీ సర్పంచ్ కేదారినాథ్ పాటిల్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏసయ్య, నాయకులు సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, అప్పుడే అభివృద్ధి జరుగుతుందని ఎంపీడీఓ సురేష్ సూచించారు. ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా ఎంపికైన గుంజోటి గ్రామ కార్యదర్శి సంతోష్‌కుమార్‌ను అధికారులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా చూడాలని కోరారు. సంతోష్‌కుమార్‌ను ఆదర్శంగా తీసుకొని మిగతా పంచాయతీ కార్యదర్శులు కూడా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రప్ప, మాజీ సర్పంచ్ చెన్నమ్మ, పంచాయతీ కార్యదర్శి ఈశ్వర్‌తో పాటు విశ్వనాథం, బీరప్ప, సతీష్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శిని సన్మానిస్తున్న నాయకులు

ఘనంగా నాగఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



బోనాల ఊరేగింపు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం గౌసాబాద్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం నాగ ఎల్లమ్మ దేవత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉదయం నుంచి హోమాలు, పూజలు చేశారు. గురువారం రాత్రి విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలో ప్రతిష్ఠించారు. మహిళలు బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ శిఖర ప్రతిష్ఠాపన కూడా చేపట్టారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు.

ఏఈఓల బాధ్యతల స్వీకరణ

మునిపల్లి(అందోల్): మండలంలోని ఆయా గ్రామాల్లో బదిలీపై వచ్చిన వ్యవసాయ విస్తరణ అధికారులు శుక్రవారం వారికి కేటాయించిన రైతు వేదికల్లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ సమస్యలు ఉన్నా గతంలో ఉన్న ఫోన్ నంబర్లకే ఫోన్ చేయాలని రైతులను కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 19 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 19 మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు రూ. 2 వేల చొప్పున జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం, గురువారం నిర్వహించిన తనిఖీలో 19 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత



బసవేశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు

జహీరాబాద్ టౌన్: ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత దొరుకుతుందని మైసూరు మల్లేశ్వరీ దాసోహ మఠం పీఠాధిపతి జయదేవి మాత అన్నారు. జహీరాబాద్ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో ఆమె శ్రావణ మాసం పురస్కరించుకుని ప్రవచనాలు బోధిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఆమె ప్రవచనం చేస్తూ శ్రావణ మాసంలో పార్వతి పరమేశ్వరులను పూజించాలని, అలాగే బసవేశ్వరుడి ప్రవచనలను పఠించాలని కోరారు. ఈ సందర్భంగా భక్తులు బసవేశ్వరుడికి పూజలు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

28 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడలు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్ చెరు: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, చురుకుదనం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడోత్సవాలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 28వ తేదీన పటాన్‌చెరు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో లాంఛనంగా క్రీడలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. క్రీడోత్సవాలలో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చు అని పేర్కొన్నారు. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండల విద్యాధికారులు పీపీ రాథోడ్, జెమినీ రాణి, తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: ఎమ్మెల్యే మాణిక్‌రావు.. లబ్ధిదారులకు శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 14 మంది అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్సపొందారు. ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకోగా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 4.25 లక్షలు మంజూరు చేయించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, నాయకులు మచ్చేందర్, విజయ్, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి

కంది(సంగారెడ్డి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్లలో వచ్చే మెసేజ్ లకు స్పందించరాదన్నారు. ఓటీపీలను కూడా ఇతరులకు చెప్పకూడదన్నారు. ఎవరైనా మోసాలకు గురైతే వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రూరల్ సీఐ అశోక్ కుమార్, నగేష్, కళాశాల డీన్ మనోజ్ కుమార్, ఎస్సై వినయ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కమ్యూనిటీ హాలు మంజూరుకు వినతి

జహీరాబాద్ టౌన్: గ్రామంలో ముదిరాజ్ కమ్యూనిటీ హాలు మంజూరు చేయాలని మండలంలోని సత్వార్ గ్రామస్తులు ఎమ్మెల్యే మాణిక్‌రావును కోరారు. గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో ముదిరాజ్ కులస్తులు చాలా మంది ఉన్నారని, శుభకార్యాలు, సమావేశాలకు భవనం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఈ విషయమై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

◆ స్టేషన్‌లో మరుగుదొడ్డికి తాళం

రామాయంపేట(మెదక్): రామాయంపేట మండలం అక్కన్నపేట రైల్వేస్టేషన్‌లో దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి ఎల్లవేళలా తాళం వేసే ఉంటుంది. దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన రైల్వేస్టేషన్లలో ఆ శాఖ రెండేళ్ల క్రితం మరుగుదొడ్లు ఏర్పాటు చేసింది. సంబంధిత కాంట్రాక్టర్ అక్కన్నపేట స్టేషనలో దీనిని ఏర్పాటు చేసి తాళం వేసి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి తాళం తీయలేదు. దీంతో వికలాంగులు ఇబ్బందుల పాలవుతున్నారు. ఈ విషయమై ఆ శాఖ అధికారులను సంప్రదించగా, మరుగుదొడ్డి తాళాలు స్టేషన్‌లో ఉన్నాయని, ఎవరైనా అడిగితే తాళాలు ఇస్తామని చెప్పడం గమనార్హం.

◆ అవంచలో ఉచిత వైద్య శిబిరం

నర్సాపూర్ రూరల్: మండలంలోని అవంచలో శుక్రవారం సంగారెడ్డికి చెందిన వెల్ నెస్ ప్రైవేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, డాక్టర్లు కరుణ, కొండి మల్లేశ్, బాలయ్య, బాలరాజు పాల్గొన్నారు.

◆ మైనంపల్లి పరామర్శ

రామాయంపేట(మెదక్): అనారోగ్యంతో మృతి చెందిన స్థానిక ఉపాధ్యాయుడు ఐరేని రవీందర్‌గౌడ్ కుటుంబ సభ్యులను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పరామర్శించారు. మృతదేహంపై పూలమాలలువేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్, ఇతర నాయకులు మైనంపల్లి వెంట ఉన్నారు.

◆ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్, హవేళిఘణాపూర్ మండలాల్లో పరిసరాల పరిశుభ్రతపై వైద్య సిబ్బంది, అంగన్‌వాడీల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రజలు వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.